సాక్షి
పెద్దపల్లి
ఆదివారం । 2 । ఏప్రిల్ । 2023



హలీం.. రుచికి సలామ్..!

- ఉమ్మడి జిల్లాలో ఘుమఘుమలాడుతున్న రంజాన్ రుచులు
- నోరూరిస్తున్న వివిధరకాల వంటకాలు

సాయంత్రం అయ్యిందంటే చాలు రోడ్లపక్కన రంజాన్ రుచులు నోరూరిస్తున్నాయి. రంజాన్ మాసంలో ఓ వైపు ముస్లింలు ఉపవాస దీక్షలు చేస్తుండగా... మరోవైపు వివిధ రకాల వంటకాలు ఇఫ్తార్ సమయంలో ఆకర్షిస్తున్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న పట్టణాల్లో ఏర్పాటు చేసిన రంజాన్ ప్రత్యేక స్టాళ్లలో చికెన్, మటన్ వంటకాలు ఆకట్టుకుంటున్నాయి. రంజాన్ మాసంలో లభించే అరుదైన వంటకం హలీం కోసం పోటీపడుతుండగా.. చిన్నాపెద్దా తేడా లేకుండా ఇష్టంగా ఆరగిస్తున్నారు. హలీంతో పాటు హరీస్.. ఇతర చికెన్, మటన్ ఫ్రై వంటకాలు అందుబాటులో ఉంటున్నాయి. రంజాన్ రుచులు.. హలీం ప్రత్యేకతపై సండే స్పెషల్..!! – విద్యానగర్(కరీంనగర్) 8లో▸





జీవితం అంటే నిన్ను నువ్వు చూసుకోవటం కాదు, నిన్ను నువ్వు రూపుదిద్దుకోవటం.
– మహమ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
ఆది 6:33	సోమ 4:43

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

పీపుల్స్ మార్చ్‌లో రాజ్‌ఠాగూర్



భట్టి విక్రమార్కతో కలిసి పాదయాత్ర చేస్తున్న రాజ్‌ఠాగూర్

గోదావరిఖని: సీఎల్పీ నేత బట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్‌లో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్.రాజ్‌ఠాగూర్ శనివారం పాల్గొన్నారు. మంచిర్యాల జిల్లా మెట్‌పల్లి నుంచి బయలుదేరిన బట్టితో కలిసి పాదయాత్రలో ముందుకుసాగారు. ఆయన వెంట నాయకులు రవికుమార్, రవియాదవ్, యుగేందర్, దాసరి విజయ్‌కుమార్, ఈదునూరి హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీలో 1,6059 మి.యూ విద్యుత్ ఉత్పత్తి

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండంలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో 16,059 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అయ్యింది. 15,750 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి లక్ష్యం కాగా.. మార్చి 27నే చేరుకుంది. నాలుగు రోజుల ముందుగానే లక్ష్యాన్ని సాధించడంపై ఉన్నతాధికారులు హర్షం వ్యక్తం చేశారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 2550 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతున్నట్లు సమాచారం.

కార్మిక ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారం



మాట్లాడుతున్న ముత్యంరావు

జ్యోతినగర్: కార్మిక ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు అన్నారు. శనివారం ఎన్టీపీసీ లేబర్ గేట్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 5న చలో ఢిల్లీ ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. కేంద్రం గ్యాస్, పెట్రోల్ ధరలు పెంచి సామాన్యుల నడ్డి విరుస్తోందని, కార్మిక చట్టాలను మారుస్తూ.. నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకొచ్చి యాజమాన్యాలకు కార్మికులను కట్టు బానిసలుగా చేస్తోందని మండిపడ్డారు. సదస్సులో జిల్లా కోశాధికారి రామాచారి, నాయకులు దండ రాఘవరెడ్డి, యాకూబ్, మల్లేశ్, పురుషోత్తం, అర్జున్, రవీందర్, షమీం, శ్రీనివాస్ రెడ్డి, చంద్రమౌళితోపాటు పలువురు పాల్గొన్నారు.

ట్రినిటీలో వీడ్కోలు హంగామా

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం కాసులపల్లి లోని ట్రినిటీ ఉన్నత పాఠశాలలో శనివారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. క్రమశిక్షణతో మెలగుతూ ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని వాటిని సాధించాలని అప్పన్నపేట సింగిల్ విండో చైర్మన్ దాసరి చంద్రారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.


బ్రిడ్జి కోర్సు పరీక్షలకు 594 మంది హాజరు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ఇంటర్ బ్రిడ్జి కోర్సు పరీక్షలకు శనివారం 594మంది విద్యార్థులు హాజరయ్యారని ఇంటర్ నోడల్ అధికారి కల్పన తెలిపారు. బ్రిడ్జి పరీక్షలకు జిల్లాలో 10పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. శనివారంతో ఇంటర్ పరీక్షలు ముగిశాయని, సహకరించిన అన్ని శాఖల అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

88,385 డాక్యుమెంట్లు..
రూ. 311.60 కోట్ల ఆదాయం

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 2022-23లో దండిగా రిజిస్ట్రేషన్లు

- గతేడాది కన్నా రూ.65.66 కోట్ల ఆదాయం అధికం
- కోర్టులో కేసులు పరిష్కారమైనా నిషేధిత జాబితాలోనే ఆస్తులు
- సబ్ రిజిస్ట్రార్లకు పరిజ్ఞానం లేక మరిన్నింటికి బ్రేక్



2021 ఏప్రిల్ 1 నుంచి 2022 మార్చి 31 వరకు..	2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31 వరకు..
డాక్యుమెంట్లు 83,650	డాక్యుమెంట్లు 88,385
వచ్చిన ఆదాయం రూ.245.94 కోట్లు	వచ్చిన ఆదాయం రూ.311.50 కోట్లు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రిజిస్ట్రేషన్ శాఖకు 2022–23 ఆర్థిక సంవత్సరం కాసుల పంట పండింది. ఆస్తుల రిజిస్ట్రేషన్‌లు పెరగడంతో గతంలో కన్నా రూ.66 కోట్ల ఆదాయం ఎక్కువగా వచ్చింది. 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31 తేదీ వరకు పరిశీలించగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 13 రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో 88,385 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అయ్యాయి. వాటి ద్వారా ప్రభుత్వానికి రూ.311.60 కోట్ల ఆదాయం సమకూరింది. గతేడాదితో పోల్చితే రూ.65.66 కోట్లు ఎక్కువగా వచ్చింది.

అడ్డంకిగా కోర్టు కేసులు

కోర్టు కేసుల్లో ఉన్న భూముల సమస్యలు పరిష్కారం అయినప్పటికీ వాటిని ప్రొహిబిటెడ్ లిస్ట్ నుంచి తొలగించడం లేదు. కోర్టు కేసుల్లో ఉన్న సర్వే నంబర్లలో చాలా వరకు పరిష్కారం అయినట్లు ఆర్డర్లు వచ్చినా సంబంధిత వినియోగదారులు రిజిస్ట్రేషన్ శాఖకు సమాచారం ఇవ్వకపోవడంతో ఇంకా ప్రొహిబిటెడ్ లిస్ట్‌లోనే కొనసాగుతున్నాయి. దీంతో చాలా వరకు రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోతున్నాయి. కరీంనగర్ పరిధిలో చాలా కేసులు పెండింగ్‌లో ఉండడంతో రిజిస్ట్రేషన్‌లు కాలేదు. మరికొన్నింటిలో గుంటల్లో సమస్యలు ఉన్న సంబంధిత సర్వే నంబర్‌లో కేసులు చూపించడంతో ప్రజలు భయపడుతున్నారు. కోర్టుల్లో పరిష్కారం అయిన ఆర్డర్ల సమాచారం పూర్తికాగానే రిజిస్ట్రేషన్ శాఖకు వస్తే మరిన్ని రిజిస్ట్రేషన్‌లు పెరిగే అవకాశాలున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఇక గంగాధర సబ్‌రిజిస్ట్రార్ పరిధి కొత్తపల్లి మండలంలోని పలు గ్రామాలతోపాటు కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని రెండు ఏరియాల్లో ఏ ప్లాట్ రిజిస్ట్రేషన్‌కు వెళ్లినా కోర్టు నుంచి అర్డర్ తప్పనిసరి అవుతోంది. రిజిస్ట్రేషన్ చేసుకునే వారు హైకోర్టును ఆశ్రయించి తీర్పుల కాపీలు చూపిస్తేనే రిజిస్ట్రేషన్‌లు అవుతున్నాయి.


చదువురాని సబ్‌రిజిస్ట్రార్లు...!

కోర్టు కేసులకు సంబంధించిన ఆర్డర్లు, ఏసీబీ, ఐటీతోపాటు వివిధ సంస్థల నుంచి నిషేధిత జాబితాలో పెట్టాలని, లేదా వాటికి సంబంధించిన సమాచారం కావాలని రిజిస్ట్రేషన్ శాఖకు పంపితే.. ఆర్డర్ల అర్థాలు కూడా సబ్‌రిజిస్ట్రార్లకు తెలియడం లేదు. దీని కారణంగా వివిధ శాఖ నుంచి ఉత్తర్వులు రాగానే వాటిలో ఏముందో సరిగా అర్థం చేసుకోలేక నిషేధిత జాబితాలో పెడుతున్నారు. దీంతో వందల సంఖ్యలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కేసులతో సంబంధం లేని ఆస్తులకు కూడా ప్రొహిబిటెడ్ లిస్ట్ వంక చూపుతూ సబ్‌రిజిస్ట్రార్లు అందినకాడికి దండుకొని రిజిస్ట్రేషన్‌లు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ఎస్‌ఆర్‌వో	డాక్యుమెంట్లు	వచ్చిన ఆదాయం(కోట్లలో)
గంగాధర	8,567	32.28
హుజూరాబాద్	4,926	16.39
జగిత్యాల	8,570	29.97
మల్యాల	2,342	4.94
మంథని	2,120	4.50
మెట్‌పల్లి	4,361	10.48
పెద్దపల్లి	10,401	49.21
సిరిసిల్ల	10,016	19.99
సుల్తానాబాద్	1,981	6.31
వేములవాడ	10,407	22.06
కరీంనగర్	13,818	79.72
కరీంనగర్‌రూరల్	6,198	21.89
కోరుట్ల	4,678	13.86

రవాణా శాఖ ఆదాయం రూ.303.39 కోట్లు

గతేడాదితో పోలిస్తే 54 శాతం వృద్ధి రేటు





చంద్రశేఖర్ గౌడ్

ఉమ్మడి కరీంనగర్ జిల్లా రవాణా శాఖ వార్షిక ఆదాయం రూ.303.39 కోట్లు సమకూరింది. ఇది ఉమ్మడి జిల్లా చరిత్రలో అధికం. గతేడాది వాహనాల కొనుగోళ్లు విపరీతంగా పెరిగాయి. దీంతో లైఫ్‌టాక్స్, క్వార్టర్లీ టాక్స్, సర్వీస్ టాక్స్‌లు అత్యధికంగా వసూలయ్యాయి. గతేడాది అధికారులు నిర్వహించిన తనిఖీల్లో జరిమానాల రూపంలో నిధులు రవాణా శాఖ ఖాతాల్లోకి వచ్చి చేరాయి. క్వార్టర్లీ, లైఫ్‌టాక్స్‌లకు తోడు ఫీజుల ద్వారా రూ.40.48 కోట్లు, సర్వీస్ చార్జీల ద్వారా రూ.9.40కోట్లు, తనిఖీల రూపంలో రూ.10.25కోట్ల ఆదాయం వచ్చినట్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చంద్రశేఖర్‌గౌడ్ వెల్లడించారు. జిల్లాల వారీగా చూస్తే.. కరీంనగర్ జిల్లాకు రూ.149.40కోట్లు, జగిత్యాలకు రూ.50.96కోట్లు, పెద్దపలికి రూ.69.97 కోట్లు, రాజన్న సిరిసిల్లకు రూ.33.6కోట్ల ఆదాయం సమకూరిందని వెల్లడించారు. 2021–22తో పోలిస్తే 2022–23లో 54 శాతం వృద్ధిరేటు సాధించామన్నారు.

వారంలో సబ్‌రిజిస్ట్రార్ సేవలు ప్రారంభం



ప్రారంభిస్తున్న కరీంనగర్ రిజిస్ట్రార్ ప్రసూన

గోదావరిఖని: వారం రోజుల్లో రామగుండంలో సబ్‌రిజిస్ట్రార్ సేవలు అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పేర్కొన్నారు. శనివారం తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గోదావరిఖనిలో కోర్టు భవనాలు, మెడికల్ కాలేజీ, భూముల రిజిస్ట్రేషన్ అందుబాటులోకి వచ్చాయన్నారు. తద్వారా జిల్లా కేంద్రానికి వెళ్లే 35 కిలోమీటర్ల భారం తప్పిందన్నారు. గోదావరిఖనిలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. కొద్దిరోజుల్లో ఐటీ పార్కు, ఇండస్ట్రియల్ పార్కు కూడా ఇక్కడకు రానుందన్నారు. దీంతో ఇక్కడ వ్యాపారం, భూముల ధరలు కూడా పెరిగి ఈ ప్రాంతం అభివృద్ధి చెందనుందన్నారు. నగర మేయర్ బంగి అనిల్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి మూల విజయారెడ్డి, నాయకులు పిటి.స్వామి పాల్గొన్నారు.

తాత్కాలికంగా పెద్దపల్లిలోనే..:

పెద్దపల్లిరూరల్: రామగుండంకు మంజూరైన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తాత్కాలికంగా జిల్లాకేంద్రంలోని కార్యాలయంలో శనివారం ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్ ప్రసూన ప్రారంభించారు. రామగుండంలో కార్యాలయాన్ని ప్రారంభించేవరకూ ఇక్కడి కార్యాలయంలోనే సేవలు పొందాలని సూచించారు. అలాగే మంథని సబ్ రిజిస్ట్రార్ ప్రియాంక రెడ్డికి రామగుండం అదనపు బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు.

రైస్‌మిల్‌లో 'విజిలెన్స్' విచారణ

- కొనసాగుతున్న అధికారుల తనిఖీ
- మిల్లర్లలో వణుకు



సుల్తానాబాద్‌లో విచారణ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

సుల్తానాబాద్: పట్టణంలో విజిలెన్స్, రెవెన్యూ, సివిల్ సప్లై అధికారులు ఓ రైస్ మిల్లులో శనివారం కూడా విచారణ చేపట్టారు. సదరు రైస్‌మిల్లులో బియ్యం దించినట్టు తెలుసుకుని పరిశీలించారు. అయితే అందులో బియ్యం నిల్వ లేకున్నా.. మరో రైస్‌మిల్లుకు చెందిన ధాన్యం మాత్రం నిల్వ ఉన్నట్లు అధికారులు గుర్తించారు. డాటా ఎంట్రీ ఆపరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, డ్రైవర్ కం ఓనర్లు ఆంజనేయులు, వెంకటేశం ఇచ్చిన సమాచారం ప్రకారం అధికారులు రైస్‌మిల్లు స్టాక్ వెరిఫై చేశారు. ఇందులో రేషన్ బియ్యం లేవని తేలడంతో గుమస్తా రవీందర్‌ను పిలిచి విచారించారు. అలాగే బియ్యం, లారీ మాయమైన అంశంపై విచారణ చేపట్టనున్నట్టు అధికారులు తెలిపారు. విచారణలో విజిలెన్స్ తహసీల్దార్ దినేష్ చంద్ర, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు అనిల్ కుమార్, వరుణ్ ప్రసాద్, ఎస్సై నారాయణబాబు, డీఎస్‌వో వెంకటేష్, డీటీ శంకర్, ఎఫ్‌ఐ దినేష్, హెడ్ కానిస్టేబుల్ రవీందర్, కానిస్టేబుల్ అనిల్ కుమార్ , అశోక్ తదితరులు ఉన్నారు.

సూత్రధారులు ఎవరో..?

రేషన్ బియ్యం లారీలు మాయం కాగా అవి ఎటు వెళ్లాయి..? అని ఆరా తీస్తున్నారు. పట్టుబడిన శ్రీనివాస్ రెడ్డి, ఆంజనేయులు, వెంకటేశం చెప్పిన మాదిరిగా విచారణ చేసిన సమయంలో లారీలు, బియ్యం రైస్‌మిల్లుల్లో లేకపోవడంతో అధికారులు కంగుతిన్నారు. లోతుగా విచారణ చేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకుంటామని అధికారులు అంటున్నారు. సూత్రధారులు ఎవరో..? పాత్రధారులు ఎవరో..? త్వరలో బయటపెడతామని తెలిపారు.

రేషన్ డీలర్‌పై పూర్తిస్థాయి ఆధారాలు

మండలంలోని కదంబాపూర్ గ్రామానికి చెందిన ఓ డీలర్ రేషన్ బియ్యం వ్యాపారం చేసి కోట్లు సంపాదించారని అధికారులు తెలిపారు. పూర్తి ఆధారాలు తమ వద్ద ఉన్నాయని విజిలెన్స్ అధికారులు అంటున్నారు. ఆ రేషన్ డీలర్ వద్ద ఇప్పటివరకు సివిల్ సప్లై అధికారులు తనిఖీలు ఎందుకు చేయలేదని అధికారులను ప్రశ్నించడం గమనార్హం. రేషన్ బియ్యం దందా చేస్తున్నది ఎవరెవరో తేలాల్సి ఉందని, ప్రభుత్వ ఆదాయానికి గండి కొడితే ఎవరినీ వదిలిపెట్టబోమని అధికారులు హెచ్చరించారు.

వీటితోనే వదిలిపెడతారా..?

అధికారులు తమ విచారణను రేషన్ బియ్యం, రెండు లారీలతోనే వదిలిపెడతారా..? లేక జిల్లాలో పేరుమోసిన బడా రైస్‌మిల్ వ్యాపారులపై దృష్టి సారిస్తారా తేల్సి ఉంది. జిల్లాలో కొందరు మిల్లర్లు రేషన్ బియ్యం కొని.. మళ్లీ అవే బియ్యాన్ని సీఎమ్మార్ కింద ప్రభుత్వానికి అప్పగిస్తున్నారని రైస్ మిల్లర్లు బహిరంగంగా చెబుతుండడం విశేషం. విజిలెన్స్ అధికారులు లోతుగా విచారణ చేసి.. బియ్యం శాంపిల్లను పరిశీలిస్తే మిల్లర్ల బాగోతం బయటపడుతుందని పలువురు సూచిస్తున్నారు.

భూ క్రమబద్ధీకరణకు ఈనెల 30గడువు

పెద్దపల్లిరూరల్: జీఓ నంబర్ 58, 59 ద్వారా అభ్యంతరం లేని ఆక్రమిత ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణకు ఈనెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సంగీత కోరారు. కటాఫ్ తేదీని 2020 జూన్ 2వ తేదీకి పొడిగిస్తూ ప్రభుత్వం గత నెల 17న ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. మీసేవా కేంద్రాల ద్వార దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సింగరేణి భూముల క్రమబద్ధీకరణకు జూన్ 30 లోగా దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించాలని సూచించారు. ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య 76 ప్రకారం జిల్లాలోని ఆక్రమిత సింగరేణి రెసిడెన్షియల్, కమర్షియల్ భూముల క్రమబద్ధీకరణకు 2020 జూన్ 02 కటాఫ్ తేదీగా ప్రభుత్వం పొడిగించిందన్నారు. జూన్ 30లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా రావుల రాజేందర్



గోదావరిఖని: బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా గోదావరిఖనికి చెందిన రావుల రాజేందర్‌ను నియమిస్తూ.. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ శనివారం ఆదేశాలు జారీ చేశారు. సోమారపు సత్యనారాయణ రాజీనామా చేయడంతో రాజేందర్‌ను నియమించారు. పార్టీ శ్రేణులు టపాసులు కాల్చి, స్వీట్లు పంచిపెట్టి సంబరాలు జరుపుకున్నారు.

కనులపండువగా శ్రీలక్ష్మీనృసింహుని కల్యాణం



పాల్గొన్న భక్తులు



పెద్దాపూర్ శ్రీలక్ష్మీనరసింహుని కల్యాణఘట్టం

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్ శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీలక్ష్మీసమేత నృసింహుని కల్యాణాన్ని శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు వేలాదిగా తరలివచ్చారు. స్వామివారికి మొక్కులు చెల్లించారు. పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చింతకుంట విజయరమణారావు, గుజ్జుల రామకృష్ణారెడ్డి, సర్పంచ్ భారతి, ఎంపీటీసీ గొట్టెముక్కుల రజనీ, ఎంపీపీ రమాదేవి, బీఆర్ఎస్ నాయకులు నల్ల మనోహర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గంటా రాములు యాదవ్, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు స్వామివారికి మొక్కులు సమర్పించారు. ఆలయ ధర్మకర్త, బీజేపీ నాయకుడు గొట్టెముక్కుల సురేశ్‌రెడ్డి అన్నదానం ప్రారంభించారు. ఇన్‌చార్జి ఈవో సదయ్య, శాంతన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో 8.44 లక్షల టన్నుల యూరియా ఉత్పత్తి



ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం ఫెర్టిలైజర్స్ కెమికల్ కర్మాగారంలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో 8.44లక్షల టన్నుల యూరియా ఉత్పత్తి చేసిందని సంస్థ సీజీఎం సుధీర్‌కుమార్ ఝా శనివారం తెలిపారు. ఉత్పత్తి అయిన యూరియాలో రాష్ట్రానికి 50.97 శాతం, ఆంధ్రప్రదేశ్‌కు 18.22, కర్ణాటకకు 21.42, మహారాష్ట్రకు 4.14, ఛత్తీస్‌గఢ్‌కు 2.07, తమిళనాడుకు 3.17శాతం సరఫరా చేశామని పేర్కొన్నారు.

క్లుప్తంగా

పాత లబ్ధిదారులకే ఇళ్లు కేటాయించాలి



సంఘీభావం తెలుపుతున్న నాయకులు

రామగుండం: అంతర్గాం మండల కేంద్రంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లను పాత లబ్ధిదారులకే కేటాయించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు డబుల్ గృహ సముదాయ ప్రాంగణంలో 2016లో ఎంపికైన లబ్ధిదారులు చేపడుతున్న రిలే దీక్షలకు శనివారం సంఘీభావం తెలిపారు. గతంలో డ్రా విధానంలోనే అర్హుల ఎంపిక జరిగిందని, ఇప్పుడు వారిని కాదని, మళ్లీ డ్రా తీస్తామనడం ఏంటని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, పాతవారికి ఇళ్లు ఇచ్చిన తర్వాతే కొత్తవారిని ఎంపిక చేయాలని కోరారు. లేనిపక్షంలో బాధితుల పక్షాన ఉద్యమిస్తామని హెచ్చరించారు. ప్రజాపంథా జిల్లా కన్వీనర్ గుజ్జుల సత్యనారాయణరెడ్డి, నాయకులు జూపాక శ్రీనివాస్, గుమ్మడి వెంకన్న, పెండ్యాల రమేశ్, గొల్లపల్లి చంద్రయ్య తదితరులున్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడికి డాక్టరేట్



లక్ష్మణ్‌కుమార్‌కు పట్టా అందిస్తున్న సిధారెడ్డి

రామగిరి(మంథని): ముత్తారం మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు భోజనపల్లి లక్ష్మణ్ కుమార్ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందారు. వరంగల్ జిల్లా వచన కవితా పరిణామం.. ఒక పరిశీలన అనే అంశంపై ప్రముఖ సాహితీవేత్త, తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షుడు, నంది అవార్డు గ్రహీత డాక్టర్ నందిని సిధారెడ్డి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయానికి తన గ్రంథాన్ని సమర్పించగా వర్సిటీ అధికారులు డాక్టరేట్ ప్రకటించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌కుమార్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హైమావతి, టీచర్లు శనివారం అభినందించారు.

నదిలో దూకేందుకు మహిళ యత్నం

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): గోదావరి నదిలో దూకేందుకు ప్రయత్నించిన ఓ వివాహితను రివర్ పోలీసులు కాపాడారు. వారి వివరాల ప్రకారం.. బేగంపేట్‌కు చెందిన వివాహిత కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైంది. శనివారం గోదావరి బ్రిడ్జి వద్దకు వచ్చి, నదిలో దూకేందుకు ప్రయత్నించింది. అక్కడే విధులు నిర్వహిస్తున్న రివర్ పోలీసులు గమనించి, ఆమెను అదుపులోకి తీసుకొని, కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు.

జీడీకే-5 ఓసీపీ సందర్శన



గోదావరిఖని(రామగుండం): ఆర్జీ-1 పరిధిలోని జీడీకే-5 ఓసీపీని డైరెక్టర్(పా) బలరాం శనివారం రాత్రి సందర్శించారు. బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, రవాణాకు సంబంధించిన వివరాలు తెలుసుకొని, సూచనలు చేశారు. బొగ్గులో ఫైర్ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్జీ-1 జీఎం శ్రీనివాస్, ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్ తదితరులున్నారు.

బొగ్గు రవాణాపై సమీక్ష..

ఆర్జీ-1 ఏరియాలో బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతపై జీఎం శ్రీనివాస్ శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. బొగ్గు రవాణా, ఓవర్ బర్డెన్ తరలింపు, రక్షణ, సివిల్ పనులకు సంబంధించిన అధికారులతో మాట్లాడారు.

- 1956లో ప్రారంభమైన ప్రస్థానం
- తొలిదశలో పోస్టు కార్డులతో ప్రచారం
- నేడు గల్లీ నుంచి రెస్టారెంట్ల వరకు విక్రయాలు
- నగరంలో రంజాన్ రుచుల సందడి
- 20 సెంటర్లలో నిత్యం 5 క్వింటాళ్ల తయారీ

హలీం..

సండే స్పెషల్

విద్యానగర్(కరీంనగర్): హలీం.. రంజాన్ మాసంలో లభించే అరుదైన వంటకం. ముస్లింల సంప్రదాయ వంటకంగా పేరొందినా.. కాలక్రమంలో అన్ని మతాలవారు ఇష్టంగా తినడంతో ప్రాచుర్యం పొందింది. కులమతాలకు అతీతంగా ప్రజలందరూ ఇష్టపడే హలీంకు ఒకప్పుడు హైదరాబాద్ కేంద్రంగా ఉండేది. మారుతున్న కాలానికి అనుగుణంగా ఉమ్మడి కరీంనగర్‌లోని సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాకేంద్రాల్లోనూ హైదరాబాద్ రుచిని మరిపించేలా హలీం కేంద్రాలు వెలుస్తున్నాయి.

రుచికి సలాం..!



ఇలా తయారు చేస్తారు..

గోధుమ రవ్వ, నెయ్యి, మటన్ (బోన్‌లెస్), పుట్నాల పప్పు (తినే శెనగ పప్పు), గరం మసాలా, ఉల్లిపాయలు, కొత్తిమీర, పుదీనాతో తయారు చేస్తారు. లేత పొట్టేలు మాంసం అయితే రుచి బాగా ఉంటుంది. మాంసాన్ని పెద్ద మందపాటి పాత్రలో 5 గంటల పాటు ఉడికిస్తారు. గోధుమ రవ్వ, పుట్నాల పొడి, గరం మసాల వేసి బాగా కలిపి మరో 4 గంటల పాటు సన్నటి సెగపై (అడుగు అంటకుండా) ఉడికిస్తారు. బాగా మెత్తగా ఉడికిన తర్వాత ఈ మిశ్రమానికి నెయ్యి కలిపి మెత్తగా కలిసిపోయే వరకూ పొడవైన కర్రలతో రుబ్బుతారు.



ఇరాన్‌కు చెందిన హుస్సేన్ జాబిత్ 1947లో హైదరాబాద్‌లోని మదీనా సర్కిల్‌లో హోటల్ ప్రారంభించి హలీం విక్రయాలు ప్రారంభించాడు. తర్వాత కాలంలో 1956లో రంజాన్‌మాసం ప్రారంభమైన తొలిరోజు హలీం పేరుతో కొత్త వంటకాన్ని తయారు చేసి 25పైసలకు ఒక పాత్రలో ఇవ్వడంతో దీని ప్రస్థానం ప్రారంభమైంది. తొలిరోజుల్లో అంతగా ఆదరణ లభించకపోవడంతో బిర్యానీకి హలీం ఫ్రీ అని ప్రకటించారు. తర్వాత సంవత్సరం హలీం విశిష్టతను తెలియజేస్తు పోస్టుకార్డులతో ప్రచారం నిర్వహించారు. టెలిఫోన్ డైరెక్టరీ ఆధారంగా అందులో ఉన్న అడ్రస్‌లకు పోస్టుకార్డులు రాశారు. దీంతో కొంత మేర విక్రయాలు పెరిగాయి. 1956–1960 వరకు పోస్టుకార్డులు, పత్రిక ప్రకటనలు, పోస్టర్లు తదితర మార్గాల్లో హుస్సేన్ ప్రచారం నిర్వహించగా ఆయన ప్రయత్నం ఫలించింది. 1961 నుంచి హలీంకు డిమాండ్ పెరిగింది. అప్పటి నుంచి 1998 వరకు మదీనా హోటల్‌లో హలీం విక్రయాలు జరిగాయి. అదే సంవత్సరం హుస్సేన్ మరణించాడు.

కరీంనగర్‌లో 5 క్వింటాళ్ల హలీం

కరీంనగర్ నగరవ్యాప్తంగా 20 హలీం సెంటర్లు ఉన్నాయి. వాటిలో రోజూ 5 క్వింటాళ్ల హలీం తయారు చేస్తుండగా విక్రయాలతో రోజూ రూ.22 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు బిజినెస్ జరుగుతోంది. హలీం అమ్మకాలకు తోడు ఇతర ప్రత్యేక వంటకాల ద్వారా మరో రూ.5లక్షల వ్యాపారం జరుగుతోంది. హలీం తయారీకి 3 క్వింటాళ్ల మేక మాసం ఉపయోగిస్తుండగా హరీస్ తయారీ కోసం క్వింటాల్ కోడి మాంసం అవసరం అవుతుంది. రోజూ ఒక్కో హలీం సెంటర్‌లో 15 నుంచి 50కిలోల హలీం, 5 నుంచి 20 కిలోల వరకు హరీస్‌ను తయారు చేస్తారు. పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా 20 హలీం సెంటర్లు ఉండగా వాటిలో అధిక భాగం గోదావరిఖనిలో ఉన్నాయి. రోజూ రెండు క్వింటాళ్ల హరీస్ విక్రయాలు జరుగుతుండగా, 500 కిలోల హలీం అమ్మకాలు సాగుతాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలో సిరిసిల్లలో రెండు, వేములవాడలో రెండు హలీం కేంద్రాలున్నాయి. నాలుగు కేంద్రాల్లో మొత్తం 60 కిలోల హరీస్, 20కిలోల హలీం అమ్మకాలు జరుగుతాయి. ఇక జగిత్యాల జిల్లా పరిధిలో మొత్తం 20 హలీం సెంటర్లు ఉండగా అత్యధికంగా జగిత్యాల జిల్లా కేంద్రంలోనే ఉన్నాయి. ఈ సెంటర్లలో మొత్తం 10 క్వింటాళ్ల హరీస్ అమ్మకాలు జరుగుతాయి.

20 ఏళ్లుగా అమ్మకాలు..



గత 20 సంవత్సరాలుగా హహేక్ క్యాటరింగ్ సెంటర్ ద్వారా హలీం, హరీష్, బిర్యానీ, అరేబియన్ వంటకాలను కరీంనగర్ నగర వాసులకు రుచి చూపిస్తున్నాం. హలీం తయారీలో ఇరానీ పద్ధతులు పాటిస్తునే కరీంనగర్ నగరవాసుల ఆహార అలవాట్లకు అనుగుణంగా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, స్వచ్ఛమైన మసాలా దినుసులు ఉపయోగించి తయారు చేయడం ఆయన ప్రత్యేకత. – బాబా పటేల్, కింగ్స్ హలీం సెంటర్, కరీంనగర్

ప్రేమాభిమానాలు ముఖ్యం..



ఉపవాస దీక్షల వల్ల ఆకలి బాధ తెలిసి పేదవాడికి కూడా సాయం చేయాలనే ఉద్దేశం కలుగుతుంది. పండుగా రోజు మతాలతో సంబంధం లేకుండా స్నేహితులను ఇంటికి ఆహ్వానిస్తాం. హలీంతోపాటు తీపితో కూడిన పాయసం తినిపిస్తాం. అందరి మనసుల్ని తీపి చేస్తూ అందరూ ప్రేమాభిమానాలతో జీవించాలని కోరుకుంటాం. – సయ్యద్ ఇర్ఫాన్, కార్ఖానగడ్డ, కరీంనగర్

ఓసీపీలకు దీటుగా భూగర్భ గనిలో ఉత్పత్తి

- ఆర్జీ-2 జీఎం ఎ.మనోహర్

గోదావరిఖని(రామగుండం): ఓసీపీలకు దీటుగా వకీల్‌పల్లి భూగర్భ గనిలో బొగ్గు ఉత్పత్తి జరిగిందని ఆర్జీ-2 జీఎం ఎ.మనోహర్ తెలిపారు. శనివారం తన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈసారి వకీల్‌పల్లి గని వందశాతం ఉత్పత్తి సాధించడం గర్వకారణమన్నారు. గని అధికారులు, ఉద్యోగులను ఆయన అభినందించారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో 85 లక్షల టన్నుల లక్ష్యానికి



మాట్లాడుతున్న జీఎం మనోహర్

గాను 85.08 లక్షల టన్నుల బొగ్గు ఉత్పతి సాధించినట్లు పేర్కొన్నారు. ఓబీ వెలికితీతలో 87 శాతంలో నిలిచిందన్నారు. ఉద్యోగులు రాబోయే రోజుల్లోనూ ఇదే స్ఫూర్తితో పని చేస్తూ రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని సూచించారు. ఇటీవలి ఆకస్మిక మరణాలను దృష్టిలో పెట్టుకొని, గనుల వద్దే మెడికల్ స్క్రీనింగ్ క్యాంప్ ఏర్పాటు చేశామన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌వోటూ జీఎం అబ్దుల్ సలీం, ఏరియా ఇంజినీర్ నరసింహారావు, డీజీఎం పర్సనల్ జి.రాజేంద్రప్రసాద్, డీజీఎం సివిల్ ధనుంజయ, డీజీఎం వర్క్‌షాప్ ఎర్రన్న, డీజీఎం ఐఈడీ మురళీకృష్ణ, సీనియర్ పర్సనల్ అధికారి మండల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎల్పీపై యాజమాన్యం ప్రత్యేక దృష్టి

- సింగరేణి డైరెక్టర్(ఆపరేషన్స్) ఎన్‌వీకే. శ్రీనివాస్

రామగిరి(మంథని): దేశంలో అత్యంత ఆధునిక టెక్నాలజీతో నడుస్తున్న సింగరేణి సంస్థ ఏపీఏ పరిధిలోని ఏఎల్పీ(అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టు)పై యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించినట్లు డైరెక్టర్(ఆపరేషన్స్) ఎన్‌వీకే.శ్రీనివాస్ తెలిపారు. గని ఆవరణలో రూ.14 లక్షలతో నూతనంగా నిర్మించిన షాంప్లింగ్ భవనాన్ని శనివారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. నిర్దేశించిన లక్ష్యాలను



షాంప్లింగ్ భవనాన్ని ప్రారంభిస్తున్న డైరెక్టర్ శ్రీనివాస్

రక్షణతో సాధించుకోవాలని, ఇందుకోసం కావాల్సిన ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. అనంతరం క్వారీ లోపల రూ.67 లక్షలతో నిర్మించనున్న 33/3.3 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. గని లోపలికి వెళ్లి, పనులను పరిశీలించారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ జనరల్ సెక్రటరీ మిరియాల రాజిరెడ్డి, జీఎం ఆర్జీ-3 తన్నీరు వెంకటేశ్వర్‌రావు, ఏపీఏ జీఎం కొప్పుల వెంకటేశ్వర్లు, అధికారుల సంఘం అధ్యక్షుడు మత్స్యగిరి నరేందర్, సివిల్ జీఎం సీహెచ్.రమేశ్‌బాబు, ఏరియా ఇంజినీర్ సీతారామం, ఏజీఎం సివిల్ పి.ప్రసాదరావు, టీబీజీకేఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ గౌతమ్ శంకరయ్య, ఏరియా రక్షణ అధికారి సీహెచ్.వెంకటరమణ, ప్రాజెక్టు అధికారి కె.నాగేశ్వర్‌రావు, ప్రాజెక్టు ఇంజినీర్ టి.రఘురాం, పర్సనల్ డీజీఎం విలాస్ శ్రీనివాస్ పోద్దార్, ఎస్‌వోఎం కె.జనార్దన్, సివిల్ ఎస్ఈ పద్మరాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సింగరేణిలోనే నంబర్‌వన్.. ఆర్జీ-1

- 128 శాతం బొగ్గు ఉత్పత్తి
- చివరి స్థానంలో ఏఎల్‌పీ

గోదావరిఖని(రామగుండం): బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనలో నాలుగు ఏరియాలు శ్రమించాయి. జిల్లాలో ఆర్జీ-1, 2, 3, ఏపీఏ ఏరియాలు ఉండగా.. ఆర్జీ-1 ఏరియా 121 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించి సింగరేణిలోనే నంబర్ వన్‌గా నిలిచింది. భారీ లక్ష్యాలతో ముందుకు సాగిన ఆర్జీ-2 ఏరియా వందశాతం బొగ్గు ఉత్పత్తి సాధించి తన పట్టు నిలుపుకుంది. ఆర్జీ-3 ఏరియా 90 శాతంలో నిలవగా ఏపీఏ ఏరియా గతేడాది కన్నా ఉత్పత్తిలో మెరుగైన పనితీరు కనబర్చింది. అయితే బొగ్గు ఉత్పత్తిలో సంస్థలోనే చివరి స్థానంలో ఉన్న ఏఎల్‌పీ గని ఉత్పత్తిలో ఈసారి పుంజుకుంది. గత పుష్కరకాలంగా ఉత్పత్తిలో అగ్రగామిగా వస్తున్న ఆర్జీ-3 ఏరియా ఈసారి 90 శాతంతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

సమీప గ్రామాల అభివృద్ధి..

జిల్లాలోని నాలుగు ఏరియాల్లో సమీప గ్రామాల అభివృద్ధి కోసం ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాయి. ప్రధానంగా జీడీకే-5 విస్తరణ కోసం సుందిళ్ల, ముస్త్యాల, జనగామ గ్రామాలకు చెందిన భూములను తీసుకోగా ఈ మేరకు ఆయా గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు పెద్దపీట వేశాయి. అలాగే పక్కనే ఉన్న పలు డివిజన్లలో కూడా రోడ్లు, మంచినీటి సౌకర్యం కోసం చేయూతనిచ్చాయి. ఆర్జీ-2 ఏరియాలో ప్రజాభిప్రాయ సేకరణలో వచ్చిన డిమాండ్ మేరకు పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించారు. ఇందులో భాగంగా పలు గ్రామాల్లో హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేశారు.



బొగ్గు వెలికితీస్తున్న షావల్ యంత్రం

నాలుగు ఏరియాల్లో బొగ్గు ఉత్పత్తి (లక్షల టన్నుల్లో)

ఏరియా	లక్ష్యం	సాధించింది	శాతం
ఆర్జీ-1	39.20	47.25	121
ఆర్జీ-2	85	85.08	100
ఆర్జీ-3	62	57.09	92
ఏపీఏ	21.30	17.07	80

మద్యంపై నిషేధాజ్ఞలు పొడిగింపు

- అనుమతి లేని డ్రోన్, డీజే సౌండ్స్‌పై చర్యలు
- సీపీ రెమా రాజేశ్వరి



గోదావరిఖని(రామగుండం): సాధారణ పౌరులు, మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని రామగుండం కమిషనరేట్ పరిధి మంచిర్యాల, పెద్దపల్లి జోన్‌లలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై నిషేధాజ్ఞలను పొడిగిస్తున్నట్లు సీపీ రెమా రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. మద్యం సేవించి వీధుల్లో తిరగడం, అసభ్య పదజాలంతో మాట్లాడటం అన్ని వర్గాల ప్రజలకు ఇబ్బందిగా పరిణమించిందన్నారు. ఈ నెలాఖరు వరకు నిషేధాజ్ఞలు కొనసాగుతాయని పేర్కొన్నారు. అలాగే డీజే సౌండ్స్, డ్రోన్‌లపైనా నిషేధాజ్ఞలు పొడిగిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాల నిర్వహణకు మైక్‌సెట్ వినియోగం తప్పనిసరి అనిపిస్తే సంబంధిత డివిజన్ ఏసీపీల అనుమతి పొందాలని సూచించారు. నిషేధాజ్ఞలు ఉల్లంఘించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

ఉద్యోగుల కృషితో బొగ్గు ఉత్పత్తి సాధించాం

- ఆర్జీ-3 జీఎం వెంకటేశ్వర్‌రావు, ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న జీఎంలు వెంకటేశ్వర్‌రావు, వెంకటేశ్వర్లు

రామగిరి(మంథని): ఉద్యోగుల కృషితో బొగ్గు ఉత్పత్తి సాధించామని సింగరేణి ఆర్జీ-3 జీఎం వెంకటేశ్వరరావు, ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు తెలిపారు. సెంటినరీకాలనీలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. 2022–23 సంవత్సరానికి గాను ఆర్జీ-3 ఏరియాకు 62 లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించగా 57.10(92.09 శాతం) లక్షల టన్నులు సాధించామన్నారు. ఓసీపీ-1లో 32 లక్షల టన్నులకు 33 లక్షల టన్నులతో 103.12 శాతం, ఓసీపీ-2లో 30 లక్షల టన్నులకు 24.10 లక్షల టన్నులు ఉత్పత్తి చేసి, 80.33 శాతం లక్ష్యాన్ని చేరుకున్నట్లు పేర్కొన్నారు. ఏపీఏ పరిధి ఏఎల్పీలో 21.3 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తికి గాను 17.1 లక్షల టన్నులు(80.16 శాతం) సాధించినట్లు చెప్పారు. లక్ష్య సాధనకు సహకరించిన ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు, సూపర్‌వైజర్లు, అధికారులకు అభినందనలు తెలిపారు. ఏఎల్పీలో ఎయిర్ చిల్లింగ్ ప్లాంట్ సామర్థ్యం మరో 50 శాతం పెంచుతామని, మైన్‌లో వెంటిలేషన్ సమస్య పరిష్కారం అవుతుందన్నారు. సేవా సమితి ద్వారా 13 బ్యాచ్‌లలో 390 మంది మహిళలకు టైలరింగ్, మగ్గం వర్క్, బ్యూటీషియన్ వంటి కోర్సుల్లో శిక్షణ ఇచ్చామని పేర్కొన్నారు. ఏరియా ఇంజినీర్ పి.ఎలీషా, ఓసీపీ-1 ప్రాజెక్టు అధికారి రాధాకృష్ణ, ఫైనాన్స్ ఏజీఎం పి.శ్రీనివాసులు, డీజీఎం(ఐఈడీ) కె.చంద్రశేఖర్, డీజీఎం(పర్సనల్) విలాస్ శ్రీనివాస్ పోద్దార్, డీవైపీఎం మారుతి తదితరులున్నారు.

నృసింహుని సేవలో ఆర్జీ-1 నూతన జీఎం



జీఎం శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ రాజలింగు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): ఆర్జీ-1 నూతన జీఎంగా బాధ్యతలు చేపట్టిన చింతల శ్రీనివాస్ శనివారం రామగిరి మండలంలోని సుందిళ్ల శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి, ప్రజలు, కార్మికులు సుఖసంతోషలతో ఉండాలని ప్రార్థించారు. అంతకుముందు ఆలయ కమిటీవారు ఆయనకు ఘన స్వాగతం పలికారు. కమాన్‌పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి రాజలింగు శాలువాతో సన్మానించారు. జీఎంకు ఆలయ అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సింగరేణి ప్రభావిత గ్రామాలు, ఆలయాల అభివృద్ధికి సహకరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సింగరేణి అధికారులు, ఆలయ కమిటీ చైర్మన్ సమ్మయ్య, నాయకులు పాల్గొన్నారు.

కార్మిక సంఘాలను లేకుండా చేసే కుట్ర

- ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్



మాట్లాడుతున్న జనక్ ప్రసాద్

రామగిరి(మంథని): సింగరేణిలో కార్మిక సంఘాలను లేకుండా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ ఆరోపించారు. సెంటినరీకాలనీలోని ఐఎన్టీయూసీ(శ్రీపాద భవన్)కార్యాలయంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన సంఘం ఆర్జీ-3 బ్రాంచి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిని యాజమాన్యం నడపడం లేదని, టీబీజీకేఎస్, బీఆర్ఎస్ నాయకులే నడిపిస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నుంచి సింగరేణికి రావాల్సిన సుమారు రూ.18 వేల కోట్లు కేవలం టీబీజీకేఎస్ చేతకానితనం వల్లే రావడం లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటీకరణకు వ్యతిరేకం అనుకుంటూనే అన్ని డిపార్ట్‌మెంట్లలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో ఉద్యోగులను తీసుకుంటోందని తెలిపారు. సింగరేణి ప్రైవేటీకరణ అయితే సుమారు 43 వేల మంది కార్మికులు, వారి కుటుంబాలు రోడ్డున పడతాయని పేర్కొన్నారు. గతంలో ఐఎన్టీయూసీ గుర్తింపు సంఘంగా ఉన్నప్పుడు సుమారు 24 వేల మందికి ప్రమోషన్స్ ఇప్పించి, గ్రూప్ గ్రాట్యుటీ స్కీమ్ తీసుకువచ్చినట్లు గుర్తు చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా కార్పొరేట్ కంపెనీలకు అమ్మేస్తోందన్నారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, సింగరేణిలో ఐఎన్టీయూసీని గెలిపించాలని కోరారు. అనంతరం శాశ్వత వేజ్ బోర్డు మెంబర్‌గా నియమితులైన జనక్ ప్రసాద్‌ను ఐఎన్టీయూసీ ఆర్జీ-3 బ్రాంచి ఆధ్వర్యంలో సన్మానించారు. ఆర్జీ- ఏరియా ఉపాధ్యక్షుడు రవీందర్ రెడ్డి, సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్స్ నరసింహారెడ్డి, ధర్మపురి, జిల్లా అధ్యక్షుడు దాస్, సెంట్రల్ క్యాంపెయినింగ్ ఇన్‌చార్జి వికాస్ కుమార్ యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతి యాదవ్, నాయకులున్నారు.

ఓసీపీ-5 కేసు విచారణ వాయిదా



కోర్టు వద్ద కార్పొరేటర్ తేజస్విని

గోదావరిఖనిటౌన్: గోదావరిఖని ఓసీపీ-5లో భారీ బ్లాస్టింగ్‌లు, పర్యావరణ కాలుష్యం కేసు విషయమై శనివారం విచారణ ఉండగా సింగరేణి కంపెనీ తరఫున ఎవరూ హాజరు కాలేదు. దీంతో న్యాయమూర్తి విచారణను వచ్చే నెల 20కి వాయిదా వేసినట్లు 11వ డివిజన్ కార్పొరేటర్ పెద్దెల్లి తేజస్విని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఓసీపీ-5 భారీ బ్లాస్టింగ్‌లతో వాతావరణం కలుషితమవుతోందని, ఫలితంగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. దీనిపై గత జనవరి 14న గోదావరిఖని సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సెల్ అథారిటీలలో(కేసు నంబర్ 1/2023) కేసు వేసినట్లు చెప్పారు. విచారణకు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వారు మాత్రమే హాజరయ్యారని, సింగరేణి వారు రాలేదన్నారు. జడ్జి విచారణను వాయిదా వేసి, సింగరేణి కంపనీవారు హాజరై, సంజాయిషీ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. పూర్తి వివరాలతో రావాలని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వారికి సూచించారని అన్నారు.





వామ్మో ఎండ..



ఎండాకాలం నేపథ్యంలో రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మధ్యాహ్న వేళ భానుడి ప్రతాపానికి బయటకి వెళ్లేందుకు జంకుతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే మేలో పరిస్థితి ఎలా ఉంటుందో అని చర్చించుకుంటున్నారు. పెద్దపల్లి పట్టణంలోని రాజీవ్ రహదారిపై శనివారం మధ్యాహ్నం ఎండ వేడికి అలసి ప్రయాణిస్తున్న వాహనదారులను 'సాక్షి' తన కెమెరాలో బంధించింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి